## బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జికి సన్మానం



భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

బాన్సువాడ టౌన్, మార్చి 27 : బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన పోచారం భాస్కర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మున్సిపల్ పాలకవర్గం, స్థానిక నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, వైస్ చైర్మన్ షేక్ జుబేర్, కోఆప్షన్ సభ్యులు బాబా, రాజు, సీనియర్ నాయకులు ఎజాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఉదయ్, కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్, లింగమేశ్వర్, నర్సగౌండ, హకీం, కిరణ్, రఫీక్, అమెర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సదరు సంఘ సభ్యులు

కామారెడ్డి, మార్చి 27 : జిల్లా కేంద్రంలోని పట్టణ సదర్ సంఘంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ 9వ తేదీ మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని వీక్లి మార్కెట్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని కులాల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అభివృద్ధి సందర్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నిధులతో బోరు ఏర్పాటు

దోమకొండ, మార్చి 27 : మండలంలోని అంచనూర్ గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో బోరు ఏర్పాటు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి తెలిపారు. అంచనూర్‌లో నీటి కొరత ఉందని తెలియగానే స్పందించి బోరు వేయడానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రవీందర్, నరేందర్‌రెడ్డి, రవి, సత్యనారాయణ, లక్ష్మణ్, నీలంరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు ఒక బాధ్యత

- ఎల్లారెడ్డి, బాన్సువాడ ఆర్డీవోలు ప్రభాకర్, రమేశ్ రాథోడ్
- ఎల్లారెడ్డి, మద్నూర్, బాన్సువాడలో 5కే రన్




ఎల్లారెడ్డిలో 5కే రన్‌లో పాల్గొన్న ఆర్డీవో ప్రభాకర్, అధికారులు




బాన్సువాడలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో రమేశ్ రాథోడ్

ఎల్లారెడ్డి/ మద్నూర్/ బాన్సువాడ టౌన్, మార్చి 27: ఓటు ఒక బాధ్యత అని, అందరూ కచ్చితంగా వేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. ఎల్లారెడ్డిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం ఉదయం 5కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఓటు ఉన్న ప్రతిఒక్కరూ పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించుకోవాలని సూచించారు. యువకులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ఓటింగ్ శాతం పెరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్ కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ నాయక్, ఎస్సై మహేశ్ తదితరులు పాల్గొన్నారు. ఓటర్లను చైతన్యం చేయడంలో భాగంగా మద్నూర్‌లో 5కే రన్‌ను నిర్వహించారు. తహసీల్ కార్యాలయం నుంచి మార్కెట్ మీదుగా రన్ కొనసాగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ ముజీబ్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటనర్సయ్య, సీనియర్ అసిస్టెంట్ విజయ్, గిర్దావర్ శంకర్, సిబ్బంది శేఖర్, రవి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు. బాన్సువాడలోని ఆర్డీవో కార్యాలయం నుంచి 5కే రన్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆర్డీవో రమేశ్ రాథోడ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

డిచ్‌పల్లి, మార్చి 27 : మండలంలోని బర్ధిపూర్ గ్రామశివారులో అమృతగార్డెన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలానికి చెందిన సుమన్, బాలరాజ్, గంగరాజు పెండ్లి పత్రికలను పంచేందుకు బుధవారం బైక్‌పై వెళ్తుండగా.. అమృతగార్డెన్ వద్ద రాంగ్ రూట్‌లో వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. కారును వెనుకవైపు నుంచి మరో ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లాకేంద్ర ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చెక్‌పోస్టు వద్ద ఉన్న పోలీసు సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## దివ్యాంగులకు ఫిజియోథెరపీ

నస్రుల్లాబాద్, మార్చి 27 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మనీషా మాట్లాడుతూ.. పాఠశాలలోని మొత్తం 15 మంది విద్యార్థులకు పరీక్షలు చేశామన్నారు. ఇంటి దగ్గర చేయాల్సిన వ్యాయామాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోచారాన్ని విమర్శించడం సరికాదు




మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్

బాన్సువాడ టౌన్, మార్చి 27 : రాష్ట్రంలో మచ్చలేని నాయకుడు, 40 ఏండ్ల రాజకీయ అనుభవం ఉన్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని కాంగ్రెస్ కార్యకర్త పాత బాలకృష్ణ విమర్శించడం సరికాదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. బాన్సువాడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవకాశవాదులు పార్టీలను వారి అవసరాల కోసం వాడుకుంటారని, అలాంటి వారి గురించి మాట్లాడడం సమయం వృథానే అవుతుందని అన్నారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో సభా సాక్షిగా పార్టీని వీడే ప్రసక్తే లేదని పోచారం స్పష్టం చేసినా.. వారిపై అవాక్కులు చవాక్కులు మాట్లాడడం సరికాదని హితవు పలికారు. అవకాశవాదులు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చే నష్టమేమి లేదని, పార్టీకి పట్టిన శని వదిలిందని అన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్, కోఆప్షన్ సభ్యులు బాబా, కనుకుంట్ల రాజు, కౌన్సిలర్లు వెంకటేశ్, హకీం, రఫీక్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైళ్లలో మొబైల్ ఫోన్ల చోరీ

- ఇద్దరు నిందితులకు 8 నెలల జైలు శిక్ష

వినాయక్‌నగర్, మార్చి 27 : నిజామాబాద్ రైల్వే జంక్షన్ పరిధిలో నడుస్తున్న రైళ్లలో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లను చోరీ చేసిన ఇద్దరు నిందితులకు 8 నెలల జైలు శిక్ష విధించినట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన గజం సత్యం, కామారెడ్డి జిల్లాకు చెందిన జూలు శ్రీకాంత్ ఇద్దరూ కలిసి కొంతకాలంగా నిజామాబాద్– కామారెడ్డి జిల్లాల మధ్య నడుస్తున్న రైళ్లలో ప్రయాణికుల నుంచి 9 సెల్ ఫోన్లను చోరీ చేశారు. కేసు నమోదు చేసి, నిందితులను పట్టుకొని సికింద్రాబాద్ రైల్వే మెట్రోపాలిటన్ కోర్టులో బుధవారం హాజరుపర్చినట్లు తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రోజారాణి వాదనల మేరకు నిందితులకు రెండో మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి గౌస్ పాషా 8 నెలల చొప్పున జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారని ఎస్సై పేర్కొన్నారు.

## జోరందుకున్న ఉపాధి హామీ పనులు



సోమేశ్వర్‌లోని నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటర్ కాలువలో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగిస్తున్న కూలీలు

బాన్సువాడ రూరల్, మార్చి 27 : మండలంలోని ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల్లో 1,750 మంది కూలీలు పాల్గొన్నారు. బోర్లం, హన్మాజీపేట్, సోమేశ్వర్, కోనాపూర్ గ్రామాల్లో పనులకు వస్తున్న కూలీల సంఖ్య భారీగా పెరిగింది. కూలీలు కాలువ పూడిక తీత, కందకాల తవ్వకం పనులు చేస్తున్నట్లు ఏపీవో మల్లేశ్ తెలిపారు. కొలతల ప్రకారం పనులు చేయిస్తున్నామని అన్నారు. మార్చి నెల ముగింపు నాటికి నిర్దేశించిన పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

## కరపత్రాల ఆవిష్కరణ

బాన్సువాడ టౌన్, మార్చి 27 : మహర్షి దయానంద సరస్వతి జయంతి ఉత్సవాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఇందూర్ సమాజ అధ్యక్షుడు కరిపె సూర్యప్రకాశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్యసమాజ్ మందిరం ఆవరణలో బుధవారం దయానంద సరస్వతి జయంతి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీన ఇందూర్ కేంద్రంలో నిర్వహించే ఉత్సవాలకు బాన్సువాడ నుంచి పెద్ద సంఖ్యలో హిందువులు తరలిరావాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యసమాజ్ పాలకవర్గానికి ఉత్సవాల కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఇందూర్ సమాజ ప్రధాన కార్యదర్శి నారాయణ, బాన్సువాడ ఆర్యసమాజ్ ప్రతినిధులు కొత్తపల్లి శ్రీనివాస్, హరిదాస్, వేదమిత్ర వేదాద్రి, నరేశ్, నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బాన్సువాడ రూరల్, మార్చి 27 : అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న వేళ నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బషీరుద్దీన్ ఉపాధి హామీ క్షేత్రసహాయకుడికి సూచించారు. మండలంలోని తిర్మలాపూర్, కొత్తాబాది గ్రామాల్లోని నర్సరీలను ఆయన బుధవారం పరిశీలించారు. నర్సరీల్లో చేపడుతున్న మొక్కల పెంపకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కలకు ప్రతిరోజూ నీళ్లు పట్టాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా గ్రీన్ షెడ్లను వేసి కాపాడాలని సూచించారు. అనంతరం కొత్తాబాది శివారులో ఉపాధి హామీ పనులను ఆయన తనిఖీ చేశారు. కొలతల ప్రకారం పనులు చేయాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్, క్షేత్రసహాయకుడు బస్వయ్య తదితరులు ఉన్నారు.

# వందశాతం పన్ను వసూలు చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్‌రావు



పెద్దకొడప్‌గల్‌లో పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రామారెడ్డి, మార్చి 27: గ్రామాల్లో వందశాతం పన్ను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) శ్రీనివాస్‌రావు అన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన డీఎల్పీవో వెంకట శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో సవితారెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

*వంద శాతం వసూలే లక్ష్యం..*

పెద్ద కొడప్‌గల్, మార్చి 27: గ్రామాల్లో వందశాతం పన్ను వసూలు చేయడమే లక్ష్యమని పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. పంచాయతీ అధికారులు మండల కేంద్రంలో బుధవారం ఇంటి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పన్ను చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు సూచించారు. ఈ నెలాఖరు వరకు వంద శాతం పన్ను వసూలు చేయడమే లక్ష్యం అన్నా రు. పంచాయతీ కార్యదర్శులు పండరి, ఖలీల్ పాల్గొన్నారు.

## నర్సరీలను పరిశీలించిన ఏపీవో

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నిజాంసాగర్, మార్చి 27: ఉమ్మడి నిజాంసాగర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈనెల 23న 'నీరు గారుతున్న లక్ష్యం – నర్సరీల్లోనే సగం ఎండుతున్న మొక్కలు' అనే శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాస్ పలు గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. మొక్కలకు రక్షణగా షేడ్ నెట్లను ఏర్పాటు చేయించారు. నీటి వసతి ఉన్న ప్రదేశాల్లో కూలీలను నియమించడం, నీటి వసతి లేని ప్రదేశాల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. నర్సరీలను ప్రతి రోజూ పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యవేక్షించాలని, మొక్కలను సంరక్షించే బాధ్యతలు దగ్గర ఉండి చూసుకోవాలని ఆదేశించారు.



తున్కిపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఏపీవో శ్రీనివాస్

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

గాంధారి, మార్చి 27: మండల కేంద్రంలోని ఇంద్రనగర్ కాలనీలో నివసించే ఒడ్డె దుర్గవ్వ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గవ్వ అంత్యక్రియలు చేయడానికి డబ్బులు లేకపోడంతో, కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రకాశ్, బంజారా సామ్య భజన మండలి సభ్యులు కలిసి రూ.ఏడు వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదే కాలనీకి చెందిన శేఖర్ తన మిత్రుల సహకారంతో మరో రూ.ఐదు వేల నగదును అందజేశాడు. ఆర్థిక సహాయం చేసిన దాతలను గ్రామస్తులతోపాటు కాలనీసులు అభినందించారు.

## చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీనం



నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

నిజాంసాగర్, మార్చి 27: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారిపై వెల్గనూర్ శివారులో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి ఓ వాహనంలో తరలిస్తున్న రూ.1.01లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో రూ.50వేలకు మించి నగదును తరలిస్తే అందుకు సంబంధించిన ఆధారాలు వెంట ఉంచుకోవాలని ఆయన సూచించారు. తనిఖీల్లో చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే అధికారులతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి విడుదల

నిజాంసాగర్, మార్చి27: ఆయకట్టు కింద సాగుచేస్తున్న పంటలకు ఈనెల 25న ప్రారంభించిన నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి విడుదల 1,296 క్యూసెక్కుల చొప్పున కొనసాగుతున్నదని నీటి పారుదల శాఖ ఏఈ శివప్రసాద్ బుధవారం తెలిపారు. ప్రాజెక్టు నుంచి ఇప్పటి వరకు 48వ డిస్ట్రిబ్యూటరీ వరకు ఆరు విడుతల్లో 9.16 టీఎంసీల నీటిని ప్రధాన కాలువ ద్వారా విడుదల చేశామని చెప్పారు. ప్రస్తుతం చివరి ఆయకట్టులో కొంత మేర పంట చేతికి వచ్చిందని, దీంతో ప్రస్తుతం 39 డిస్ట్రిబ్యూటరీ వరకు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగుతుందని అన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

## డోంగ్లీ రామాలయ ఆవరణలో మండప నిర్మాణ పనులు ప్రారంభం

డోంగ్లీ, మార్చి 27: మండల కేంద్రంలోని రామాలయ ఆవరణలో ఉగాది పర్వదినం సందర్భంగా ఏప్రిల్ 9వ తేదీన నరేంద్రాచార్య మహరాజ్ పాదుకా పూజ నిర్వహించనున్నారు. ఇందుకోసం మండపం ఏర్పాటు చేస్తున్నారు. మండప నిర్మాణ పనులను బుధవారం ప్రత్యేక పూజలను చేసి భక్తులు ప్రారంభించారు. 9న నిర్వహించే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో హన్మంత్ అంబులాల్, బాబూరావు, సురేశ్, గోవింద్, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

## పోస్టర్ల తొలగింపు



పెయింటింగ్‌పై సున్నం వేస్తున్న పంచాయతీ సిబ్బంది

పిట్లం, మార్చి 27: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పిట్లం గ్రామ పంచాయతీ పరిధిలో హైవే గోడలపై ఉన్న పలు రాజకీయ పార్టీల పోస్టర్లను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. గోడలపై వేసిన పెయింటింగ్ కనిపించకుండా దానిపై తెలుపు రంగు వేస్తున్నారు. ఎన్నికల నిబంధనలను రాజకీయ పార్టీల నాయకులు తప్పకుండా పాటించాలని పిట్లం జీపీ కార్యదర్శి యాదగిరి సూచించారు.

## బిచ్కుంద బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రకాశ్ పటేల్

బిచ్కుంద, మార్చి 27: బిచ్కుంద మున్సిఫ్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.ప్రకాశ్ పటేల్, ఉపాధ్యక్షుడిగా జి.మల్లేశ్వర్, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా విఠల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడు న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మణ్‌రావు, విఠల్‌రావు, శంకర్‌రావు పాటిల్, పురుషోత్తం అగర్వాల్, శివానీ, రవిపటేల్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

*ఏఎస్ఆర్ ఫౌండేషన్ జుక్కల్ మండల కార్యవర్గం..*

నిజాంసాగర్, మార్చి 27: ఏఎస్ఆర్ ఫౌండేషన్ జుక్కల్ మండల నూతన కార్యవర్గాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాగ్రె సతీశ్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కోశాధికారిగా మనోజ్, ఉపాధ్యక్షులుగా గజానంద్‌గౌడ్, అంజయ్య, సహాయ కార్యదర్శులుగా బాచ్రే మహేశ్, సాయికుమార్, సోషల్ మీడియా కార్యదర్శిగా సాయినాథ్‌తోపాటు సభ్యులను ఎన్నుకొని నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బంగారు రవి, ప్రధాన కార్యదర్శి వాగ్మరే బాల్‌రాజ్, నాయకులు సాయిలు, బాలకృష్ణ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఉపాధి' పనుల పరిశీలన

నిజాంసాగర్, మార్చి 27: జుక్కల్ మండలంలోని దోస్త్‌పల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. పనికి రాని కూలీలకు హాజరు వేయొదన్నారు. పనులు జరిగే ప్రదేశంలోనే మస్టర్లలో హాజరు నమోదు చేసుకునేలా చూసుకోవాల్సిన బాధ్యత కూలీలదే అని తెలిపారు. తాము పనిచేసే ప్రదేశంలో వసతులు కల్పించాలని కూలీలు ఈ సందర్భంగా ఆయనను కోరారు.



## నీటి ఎద్దడి లేకుండా చూడాలి

పిట్లం, మార్చి 27: వేసవికాలం దృష్ట్యా మండలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీవో బ్రహ్మం అన్నారు. ఆయన బుధవారం రాంపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని, వందశాతం పన్ను వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కు ఆదేశించారు.